క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రంగమనాయుడు

పాలకోడేరు: పాలకోడేరు పీహెచ్‌సీలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి సీహెచ్‌వీ రంగమనాయుడు తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశాలు గర్భిణులకు అవగాహన కల్పించి ప్రభుత్వాసుపత్రుల్లోనే పురుడు పోసుకునేలా ప్రోత్సాహించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా హైరిస్క్ కేసులను గుర్తించే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ ఎం.సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారి పారాయణం



ఉండిలో భగవద్గీత పారాయణం చేస్తున్న చిన్నారి చేతన

ఉండి: ఉండి శ్రీకృష్ణాశ్రమంలో గురువారం నిర్వహించిన భగవద్గీత పారాయణ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాధామదనమోహనస్వామి మందిరంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువుల 536వ జయంతి మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు భీమవరానికి చెందిన చిన్నారి బోలిశెట్టి చేతన చేసిన భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో భక్తులు ఆలకించారు. శ్రావ్యమైన పదవచనాలతో భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించిన ఈ కార్యక్రమ అనంతరం పలువురు చిన్నారికి అభినందనలు తెలిపారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్

వీరవాసరం: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై పి.రమేష్ కోరారు. హెల్మెట్ ధారణపై గురువారం రాయకుదురు, వీరవాసరం, నవుడూరు సెంటర్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్‌ను ధరించాలని, మోటార్ బైక్‌పై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి భద్రత సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి, వీరభద్రం, భాస్కరరావు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణం జరగనివ్వాలంటూ ధర్నా



ఉండి సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న ఎఫ్ఎఫ్‌సీఐ సంఘ నాయకులు

ఉండి: చెరుకువాడలో కల్వరీ ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ కే హేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవద్దంటూ ఎఫ్ఎఫ్‌సీఐ (ఫ్రీడం ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రిటీ), ఏఐసీఎఫ్ (ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్) నాయకుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఉండి సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. చర్చి నిర్మాణంపై స్థానికుల అభ్యంతరాలు సరైనవి కావని, అధికారులు కలుగజేసుకుని వెంటనే సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌సీఐ జాతీయ అధ్యక్షుడు పీటర్ పుట్ట, రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయేల్, స్టాన్లీ థామస్, రాజేష్ కన్నా, యేవేల్‌రాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆయా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాహ సంబంధమైన కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి గురువారం తెలిపారు. ఈ అదాలత్‌లో ముఖ్యంగా మనోవర్తి, గృహహింస చట్టం కింద నమోదైన కేసులు, హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 9 కింద నమోదైన కేసులను, ఉభయకక్షిదారుల సమక్షంలో వారి అభిప్రాయం మేరకు రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు న్యాయవాదులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో యూనిట్ల ద్వారా స్వచ్ఛమైన నీరు
- తొలివిడత సొంత భవనాలు కలిగిన కేంద్రాలకు ప్రాధాన్యం
- భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో 92 ఆర్వో యూనిట్ల ఏర్పాటు



తరటావ అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్వో యూనిట్ ద్వారా మంచినీరు తాగుతున్న చిన్నారులు

ఆకివీడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పసికందులు, చిన్నారులకు స్వచ్ఛమైన నీరు, పౌష్టికాహారం అందిస్తూ వారి భవిష్యత్ ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు కళావిహీనంగా వసతుల లేమితో, కలుషిత నీరు, వాతావరణంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కాలం గడిపేవారు. ఈ కేంద్రాలకు తమ చిన్నారుల్ని పంపేందుకు తల్లిదండ్రులు భయపడేవారు. కేంద్ర ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయి. ఆధునిక వసతులతో కేంద్రాలు కళకళలాడుతున్నాయి. అధిక శాతం కేంద్రాలకు సొంత భవనాలు సమకూరడమే కాక, అన్ని వసతులు అందుబాటులోకి వస్తున్నాయి.

సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఉండి, భీమవరం నియోజకవర్గాలలో 522 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో సొంత భవనాలు 119 ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాల నిర్మాణానికి ఆయా మండలాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. సొంత భవనాలు కలిగిన వాటిలో 92 కేంద్రాలకు మినరల్ కలిగిన ఆర్వో యూనిట్లను ప్రభుత్వం అందజేసింది. ఆయా కేంద్రాల్లో ఆర్వో యూనిట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నారు.

త్వరలో అన్ని కేంద్రాలకూ ఆర్వో యూనిట్లు

సొంత భవనాలు కలిగిన కేంద్రాలకే కాకుండా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆర్వో యూనిట్లు మంజూరు చేయలని ప్రభుత్వం నిర్ణయించింది. నేషనల్ న్యూట్రిషన్ మిషన్(పోషణ అభియాన్) పథకం, ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ఆర్వో యూనిట్లను ఆయా కేంద్రల వద్ద ఏర్పాటు చేశారు. కుళాయిల ద్వారా సరఫరా అయిన నీటిని శుద్ధి చేసేందుకు ఫిల్టర్లను వినియోగిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్వో యూనిట్ల వివరాలు

నియోజకవర్గం	ఉండి	భీమవరం
మొత్తం కేంద్రాలు	264	258
సొంత భవనాలు	69	50
ఆర్వో యూనిట్లు	46	46

ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో 46 యూనిట్లు

స్వచ్ఛమైన నీరు, వాతావరణం అందించే దిశగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి జరుగుతోంది. నాడు–నేడు పథకంలో పోషన్ అభియాన్ పథకం ద్వారా ఆర్వో యూనిట్లను మంజూరు చేశారు. రక్షిత నీరు చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి రక్షణగా ఉంది.

– వాణీ విజయరత్నం, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఆకివీడు

చలో ఢిల్లీకి తరలిరావాలి

పాలకోడేరు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అశ్రియ కోరారు. శృంగవృక్షం, పెన్నాడ గ్రామాల్లో గురువారం చలో ఢిల్లీపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల వివిధ రంగాల ఉద్యోగులు ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు స్కీం వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక చట్టాలను నీరుగారిస్తున్న కేంద్రాన్ని గద్దె దింపాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, కొటికలపూడి శ్రీను, మనోహర్, యేసు, చిన్న, వెంకన్న బాబు పాల్గొన్నారు.

యూరీ గగారిన్ జయంతి

భీమవరం(ప్రకాశం చౌక్): అంతరిక్షంలో అడుగు పెట్టిన తొలి మానవుడు, శాస్త్రవేత్త యూరీ గగారిన్ జయంతిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలో గురువారం నిర్వహించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ యూరీ గగారిన్ రష్యా దేశస్తుడని, 1961లో గగారిన్ మొట్టమొదటి వ్యోమగామి అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ అంతరిక్ష నౌకలో భూమి చుట్టూ తిరిగేప్పుడు, మన గ్రహం ఎంత అందమైనదో, ఈ అందాన్ని కాపాడుకుని, పెంపొందిద్దాం, నాశనం చేయొద్దు అని యూరీ గగారిన్ తన రాసిన పుస్తకం ద్వారా తెలియజేసారని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, టైలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ రామ కోటేశ్వరరావు, కొండ్రు శ్రీనివాస్, దివ్య సందేశ సంస్థ అధ్యక్షురాలు ఎండి సరోజినీ, అడపా సత్యవతి పాల్గొన్నారు.

నేడు తుందుర్రులో దూడల ప్రదర్శన

భీమవరం అర్బన్: పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తుందుర్రులో దూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు గురువారం చెప్పారు. ఆవులకు, గేదెలకు కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే ఉపయోగాలపై పశు పెంపకం దారులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువులకు కృత్రిమ గర్భధారణ వల్ల పుట్టబోయే దూడ బరువుగా ఉండటమే కాకుండా, ఆరోగ్యంగా ఉండి నాణ్యమైన బ్రీడ్‌ను కలిగి ఉంటాయన్నారు. పశువులకు పెయ్య దూడలు మాత్రమే పుట్టే విధంగా కృత్రిమ ధారణ చేస్తున్నామని తెలిపారు. పశుపెంపకం దారులు తమకు చెందిన దూడలను ప్రదర్శనకు తీసుకురావాలని మండల వెటర్నరీ వైద్యాధికారి పుండరీబాబు కోరారు.

కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు



మోషేన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బలే ఏసుబాబు గురువారం శాసన మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మోషేన్‌రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో బలే లూర్ధమ్మ, గంటా సుందర్ కుమార్, బోకూరి విజయరాజు, తాళ్లూరి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కే.సుజాత

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం బ్లడ్ గ్రూపు నిర్ధారణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, ఆపద్బంధు, ఆర్‌ఆర్ క్లబ్, హోమ్ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల రక్తాన్ని పరీక్షించి గ్రూపు నిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే.సుజాత మాట్లాడుతూ రక్తం ఏ గ్రూపునకు చెందినదో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఇతరులు ప్రమాదంలో ఉన్నప్పుడు బ్లడ్ గ్రూపును బట్టే రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం ఆవశ్యకతను వివరించారు. సరైన సమయంలో రక్తం అందించినప్పుడే ప్రాణం నిలబడుతుందని చెప్పారు. ఈ సందర్భంలో సంబంధిత బ్లడ్‌గ్రూపు ఉన్న వ్యక్తి నుంచే రక్తం సేకరిస్తారన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు ట్రస్టు ద్వారా చేసిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ట్రస్టు ప్రతినిధులు చందన ప్రభాకరరావు, ఇ.శ్రీధర్, టి.ఓగేశ్వరరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆనంద్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం చేరిన ఓటర్ల చైతన్య పాదయాత్ర



అడబాల దుర్గ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పాలకొల్లు నుంచి మచిలీపట్నం వరకు ఓటర్ల చైతన్య పాదయాత్ర చేస్తున్న అడబాల దుర్గ ప్రసాద్‌కు భీమవరం బుధవారం మార్కెట్ సెంటర్‌లో పట్టణ ప్రముఖులు నాయకులు ఘన స్వాగతం పలికారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాజ శ్రేయస్సుకు కొన్ని చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ స్ఫూర్తితో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని దుర్గాప్రసాద్ పాలకొల్లు నుంచి చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని అన్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటును అమ్ముకోకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిస్వార్థమైన పాలకుడిని ఎన్నుకోవడానికి ఓటు ఒక వజ్రాయుధమని అన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పాలకొల్లు, భీమవరం, గుడివాడ, మచిలీపట్నం వరకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నానని తెలిపారు. అనంతరం ఓటు ప్రతిజ్ఞ నిర్వహించారు. తోట బొగయ్య, సతివాడ హరి, ఎండి షాబు, దాసరి శ్రీను, బి శ్రీనివాస్, కీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ



ఉగాది వేడుకల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పండుగలే పట్టు కొమ్మలని, 34 ఏళ్లుగా ఉగాది వేడుకలను నిర్వహిస్తుండటం స్ఫూర్తిదాయకమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా నాయకులు మంతెన రామచంద్రరాజు అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జేపీ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు మంతెన రామ్‌కుమార్ రాజు, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ కనుమరుగైపోతున్న హిందూ సంప్రదాయలను కాపాడుకోవాల్సిన బాధ్యతా మనందరిపై ఉందని, ఉగాది వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శోభాకృత నామ సంవత్సర వేడుకలను ఈనెల 22న భీమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నామని, ఈనెల 11 నుంచి ప్రాచీన సంస్కృతి, మన తెలుగు బాషా, ఉగాది ఔన్నత్యంపై కళాశాల, పాఠశాల, దేవాలయాల్లో సదస్సులు, విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో సేవాతత్పరులకు అవార్డులు అందిస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు వడుపు గోపి, కార్యదర్శి కుక్కల బాల, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు, శ్రీనివాస చార్యులు పాల్గొన్నారు.

గుమ్ములూరు మంచినీటి చెరువుకు మోక్షం



గుమ్ములూరులో చెరువును పొక్లెయిన్‌తో తవ్వుతున్న దృశ్యం

ఆకివీడు: గుమ్ములూరు మంచినీటి చెరువుకు మోక్షం లభించింది. గత కొన్నేళ్లుగా మేటలు వేసి ఉన్న చెరువులోని పూడికల్ని సర్పంచ్ కోట అనంతలక్ష్మీ సొంత సొమ్ముతో తవ్విస్తున్నారు. మంచినీటి చెరువుకు ఆనుకుని ఉన్న పశువుల చెరువును గతంలో మంచినీటి చెరువులో కలిపి తవ్వేశారు. అయితే తవ్వకం పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ఆ ప్రాంతంలో మట్టి పేరుకుపోయి, నీటి నిల్వకు ఇబ్బందికరంగా ఉందని సర్పంచ్ చెప్పారు. చెరువులో నీటిని పూర్తి స్థాయిలో నిల్వ ఉంచి వేసవిలో నీటి కొరత లేకుండా, శివారు ప్రాంతాలకు నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం సొంత సొమ్ముతో రూ.10 లక్షల వ్యయంతో చెరువు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. చెరువు తవ్వకం పనుల్ని ఇటీవల డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నాయకులు కోట చిన్నా, మాజీ ఎంపీటీసీ తాతాజీ, స్థానికులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కాళ్ల: సీసలి గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. సీసలి గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ కట్రేడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. గతంలో చెట్టు వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. సంవత్సరం తర్వాత అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సమయంలో జాతర మహోత్సవం జరపడం ఆనవాయితీ. దాతలు గ్రామస్తులు అమ్మవారి ఆలయం ఏర్పాటు చేయాలని సంకల్పించి శంకుస్థాపనకు పనులు చేశారు. అమ్మవారి విగ్రహం, స్టేజి ఏర్పాటుకు కట్రేడ్డి శ్రీనివాసరావు, కట్రేడ్డి సురేష్ దాతలు ఒక్కొక్కరు రూ.రెండు లక్షల చొప్పున విరాళం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటూరి వెంకట శివరామరాజు, సీసలి గ్రామ సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ కట్రేడ్డి వెంకటకృష్ణ చల్లారావు (వేణు)తోట రామస్వామి, గణేశ్న పద్మారావు, గణేశ్న నల్ల శ్రీను, కట్రేడ్డి శ్రీనివాసరావు, కట్రేడ్డి వేణు, నూకల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందకపోతే సమాచారమివ్వండి

భీమవరం అర్బన్: దాళ్వా సాగులో ప్రస్తుతం వంతులవారి విధానం అమలులో ఉందని, పంట పొలాలకు సాగు నీరందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులను కోరారు. భీమవరంలోని చినఅమిరం, రాయలం, కొమరాడ గ్రామాలలోని వరి పొలాలను గురువారం ఏవో నిమ్మల శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలో రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, కొమరాడ గ్రామాల వరి పొలాలకు వంతులవారీ విధానం ద్వారా సాగునీరు సరఫరా అవుతోందన్నారు. ఆయకట్టు శివారుకు సాగునీరందకపోతే రైతులు ఆర్‌బీకేల్లోని వ్యవసాయ సిబ్బందిని, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం తెలిపితే తగు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. వంతులవారీ విధానంలో సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాములపర్రులో భగీరథుడి విగ్రహావిష్కరణ



పాములపర్రులో భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరించిన సగర సంఘ నాయకులు

ఉండి: భగీరథుడు తపస్సు శక్తితోనే భూమిమీదకు గంగను తీసుకువచ్చారని, ఆయన త్యాగం వెలలేదని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ తాటిపట్టి పెదవీరప్ప, పాములపర్రు మాజీ సర్పంచ్ నక్కా చెన్నకేశవరావు అన్నారు. పాములపర్రులో గురువారం సగర కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథుని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర సంఘ నాయకులు మాట్లాడుతూ నక్కా వెంకప్ప, వెంకటేశ్వరరావు, గండికోట వీరప్ప, తాటిపట్టి చినవీరప్ప, కటారి శ్రీను తదితరులు మాట్లాడుతూ నగరుల ఆరాధ్యదైవం భగీరథుడన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గంగను భూమి మీదకు రప్పించేందుకు భగీరథుడు చేసిన తపస్సే కారణమన్నారు. ఇక నుంచి పాములపర్రులో భగీరథుని జయంతి, వర్ధంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, బాలకోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, భానుప్రకాష్, నాగబాబు, రాంబాబు, అరుణ్, మోసేస్ తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాహాపై విచారణ

పాలకోడేరు: గరగపర్రు గ్రామంలోని పలు డ్వాక్రా సంఘాల్లో నగదు స్వాహా ఘటనపై డ్వాక్రా ఏపీఎం రవికుమార్ గురువారం విచారణ చేశారు. గ్రామంలోని ఒక వీవోఏ పరిధిలో ఉన్న డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రుణాల చెల్లింపు వ్యవహారంలో సదరు వీవోఏ నగదు స్వాహా చేసినట్లు పలువురు ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో ప్రాథమిక విచారణ చేసినట్లు రవికుమార్ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉందని, అనంతరమే ఎంత మొత్తంలో నగదు స్వాహా అయిందో తెలుస్తుందని పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం (ప్రకాశంచౌక్): అదనపు కట్నం కోసం తన భర్త మణికంఠ సుమంత్ వేధిస్తున్నట్లు రెండో పట్టణ పరిధిలోని రాయలం గ్రామానికి చెందిన అనూష అనే వివాహిత గురువారం ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని 29వ వార్డు సంజీవనగర్‌లోని రెండు పోర్షన్ల తాటాకిల్లు గురువారం అగ్నికి ఆహుతైంది. జి.ఆదాం, సామ్యేలుకు చెందిన ఇళ్లల్లో గ్యాస్ బండ నుంచి మంటలు వ్యాపించడంతో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2 లక్షల విలువైన సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జేడీవీ సత్యనారాయణ విధుల్లో నిర్లక్ష్యం కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ గురువారం చెప్పారు.

కనకదుర్గమ్మ జాతర ప్రారంభం

యలమంచిలి: అడవిపాలెంలో కనకదుర్గమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి తొలి పానకం కావిడి, సారె, చీర సమర్పించి గ్రామోత్సవంగా అమ్మవారిని పుట్టింటికి తీసుకువచ్చారు. అమ్మవారి ఘటాలకు రోజు విడిచి రోజు గ్రామోత్సవం చేస్తారు.

ఆదర్శ లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో ఆదర్శ క్లబ్ ప్రతినిధులు

ఆకివీడు: సేవా కార్యక్రమాల్లో తనదైన శైలిలో ముందుకు వెళ్తున్న ఆకివీడు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శకు ఎనిమిది అవార్డులు లభించాయని క్లబ్ ప్రతినిధులు గురువారం చెప్పారు. వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రీజియన్ స్థాయిలో ద్వితీయ ఉత్తమ క్లబ్, ద్వితీయ ఉత్తమ కార్యదర్శి పత్తి రమేష్, ద్వితీయ ఉత్తమ కోశాధికారి జాకీర్‌తో పాటు ఉత్తమ అధ్యక్షుడిగా క్లబ్ అధ్యక్షులు ఎండీ అహ్మద్ అవార్డు అందుకున్నట్లు వారు వివరించారు. అన్నదాన కార్యక్రమం, పశుసేవ, కంటి ఆపరేషన్లు, బ్యానర్ ప్రెజెంటేషన్‌లకు ఉత్తమ అవార్డులు వచ్చాయన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అహ్మద్, పత్తి రమేష్, ప్రతినిధులు గొంట్లా కృష్ణ, నేరెళ్ల రామ రోశయ్య, చెంచయ్య పాల్గొన్నారు.